క్లుప్తంగా

జగన్‌ను కలిసిన సన్నారెడ్డి



వైఎస్.జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ మేరిగ, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి

చిట్టమూరు(చిల్లకూరు): వైఎస్సార్ సీపీ చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలోని ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే సన్నారెడ్డి ఆయనను కలిసి మండలంలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యాన్ని వివరించారు. మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి

ఓజిలి: మండలంలో ప్రతి కుటుంబానికీ తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో మండలంలో జల జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నామన్నారు. పంచాయతీల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవో పీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.477 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.477 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న పాన్ బ్రోకర్స్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని పాన్ బ్రోకర్స్ అండ్ జ్యువెలరీస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం తమ సంస్థలో పని చేస్తూ ఇటీవల అనారోగ్యానికి గురైన వ్యక్తికి ఆర్థిక సాయం అందించారు. పట్టణానికి చెందిన అలీఫ్ అనే వ్యక్తి 35 ఏళ్లుగా పాన్ బ్రోకర్స్ అండ్ జ్యువెలరీస్ అసోసియేషన్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. పది రోజులు క్రితం అనారోగ్యానికి గురై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు అతని ఇంటికి వెళ్లి తమ వంతు సాయం అందించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య, అధ్యక్షులు సురేష్, భాస్కర్, కార్యదర్శులు సతీష్, ప్రసాద్, కోశాధికారులు రాజేష్, సుజన్ చేతుల మీదుగా రూ.80 వేలు అందజేశారు. ఏదైనా అవసరమైతే ఆదుకుంటామన్నారు.

సుజాతమ్మకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి నివాళి



నాయుడుపేట టౌన్: మున్సిపల్ కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీ నారాయణరెడ్డి తల్లి సుజాతమ్మ మృతిచెందారు. ఆమె ఉత్తర క్రియలు గురువారం నిర్వహించారు. ఇందులో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మోగిన బడి గంట



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



సైదాపురం: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం బడులు పునః ప్రారంభమయ్యాయి. పిల్లలు ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చారు. గతంలో పాఠశాలలు దుస్థితిలో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దారు. మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూష్‌తో కూడిన విద్యా కానుక అందించేవారు. ఈ ఏడాది విద్యా కానుక ఆలస్యంగా పంపిణీ అందించే పరిస్థితి కనిపిస్తోంది.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకే పాఠశాలకు ఉత్సాహంగా తరలివచ్చారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాకానుక అందజేస్తామని ఎంఈవో శైలజ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి బడిలో ఉండాలని సూచించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. మండలంలో 66 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు, మూడు గురుకుల పాఠశాలలు ఉన్నాయని ఎంఈవో మునిరత్నం తెలిపారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు విద్యా కానుకలు ఎమ్మార్సీకి వచ్చినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వాటిని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

పాఠశాలలకు విద్యాకానుక కిట్ల సరఫరా

దొరవారిసత్రం: మండలంలోని పాఠశాలలకు గురువారం విద్యాకానుక కిట్లు వచ్చినట్టు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 3,200 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారికి నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూ, సాక్స్‌లు వచ్చినట్టు తెలియజేశారు. ఇంకా స్కూల్ బ్యాగులు రావాల్సి ఉందన్నారు.



ఏకొల్లు హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి విద్యాకానుక కిట్లను సరఫరా చేస్తున్న అధికారులు



ఎంఎస్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

పాఠశాలలు ప్రారంభం



పాఠశాలలకు తరలిస్తున్న విద్యా సామగ్రి

చిల్లకూరు: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులు బడి బాట పట్టారు. దీంతో అన్ని పాఠశాలలు కళకళలాడాయి. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికీ అన్ని పుస్తకాలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నేడు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో విద్యార్థులకు విద్యా సామగ్రి చేతికి అందడం కొంత కష్టంగా మారింది. ఎన్నికలకు ముందుగా మండల విద్యా వనరుల కేంద్రాలకు వచ్చిన విద్యా సామగ్రితో పాటు యూనిఫాంను ఉపాధ్యాయులు తమ పాఠశాలలకు తరలించకపోవడంతో పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల పాఠ్య పుస్తకాలు కూడా పూర్తిగా అందలేదని, మరో పది రోజుల తర్వాత కానీ అందే పరిస్థితి లేదని విద్యాశాఖాధికారులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ కొత్త ప్రభుత్వం పాఠశాలలతో పాటుగా విద్యా సామగ్రిలో కొత్త మార్పులు తీసుకువస్తున్నందున కొంత ఆలస్యం కావచ్చని ఉపాధ్యాయులు అంటున్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలు ప్రారంభం కాగా విద్యార్థులు ఉత్సాహంగా తరలివచ్చారు.

నేదురుమల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమార యాచేంద్రతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కార్యకర్తలతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



నేదురుమల్లితో మాట్లాడుతున్న సైదాపురం నేతలు

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గురువారం నియోజకవర్గంలోని కలువాయి, సైదాపురం, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు చెందిన పలువురు నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంతోపాటు కార్యకర్తలకు భరోసా కల్పించడంపై చర్చించారు. అనంతరం వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సైదాపురం నేతలు..

సైదాపురం: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గురువారం సైదాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. పోలింగ్ సరళితో పాటు ప్రస్తుత పరిస్థితులను రామ్‌కుమార్‌రెడ్డికి వివరించారు. పార్టీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్యనాయుడు, శివకుమార్, మోహన్‌రావు, వైస్ఎంపీపీ తిరకాల భాస్కర్, నేతలు అబ్బిరాజు, దయాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లికార్జున్, రాధరెడ్డి, మస్తాన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, శేఖర్, బీఎస్‌యాదవ్, గంగయ్య, సుబ్బారెడ్డి, శివకుమార్, షాకీర్ తదితరులున్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా



తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి

నాయుడుపేట టౌన్: ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఈ మెయిల్ ద్వారా ఆశాఖ సెక్రటరీకి పంపినట్లు వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్‌గా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రులు కాకాణి గోవర్దన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అధి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా తనకు సహకరించిన నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



ముత్యాలపాడు ఆర్బీకేలో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

చిల్లకూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారిణి గూడూరు భవాని తెలిపారు. ఆమె గురువారం ముత్యాలపాడు ఆర్బీకేలో పచ్చిరొట్ట విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ముందుగా నేలను సారవంతం చేసుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలన్నారు. పిల్లి పెసర, జీలుగ, జనుము విత్తనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు జీలుగలు 154.9 క్వింటాళ్లు, పిల్లిపెసర 40 క్వింటాళ్లు, జనుము 15 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వాటిని 50 శాతం సబ్సిడీతో తీసుకోవచ్చని వివరించారు. జనుము కేజీ రూ.44, పిల్లిపెసర కేజీ రూ.67, జీలుగ రూ.45లకు తీసుకోవాలని సూచించారు.

కూలిన ఐదువందల ఏళ్ల నాటి వృక్షం



చిట్టమూరు మండలం గునుపాడులో కూలిన ఐదు వందల ఏళ్ల చింత చెట్టు

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం గునపాడులో గురువారం వీచిన ఈదురు గాలులకు ఐదు వందల ఏళ్ల నాటి భారీ వృక్షం నేలకూలింది. గ్రామంలోని శివాలయం ముందు సుమారు ఐదు వందల సంవత్సరాలకు చెందిన చింత చెట్టు ఉంది. గతంలో భారీ ఈదురు గాలులు వీచినా ఈ చెట్టు పడిపోలేదు. గురువారం వీచిన చిన్న పాటి ఈదురు గాలులకు పడిపోవడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ వృక్షం కూలే సమయంలో ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆలయంలోని అర్చక స్వామి శేషయ్య ఇల్లు మాత్రం స్వల్పంగా దెబ్బతిందని స్థానికులు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



క్యాన్సర్ బాధితులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని టాటా క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. పట్టణంలోని టౌన్ హాల్‌లో గురువారం పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కంటి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ గతంలో పల్లెల్లో ఎక్కువగా పొగాకు నమిలేవారని తెలిపారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు గుట్కాలు, హాన్స్ తదితరాలకు బానిసలు అయ్యారని పేర్కొన్నారు. దీంతో వారు క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి చికిత్సలు అందిస్తున్నామన్నారు. చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ టాటా క్యాన్సర్ ఆస్పత్రి, తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో కంటి వైద్య శిబిరంతోపాటు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో బాగంగా 50 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించామని, 25 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని వెల్లడించారు. ట్రస్టు ఏవో గల్లా క్రిష్ణ, జవన్, సీఈవో సీతారామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

22న పెంచలకోనలో జ్యేష్ఠాభిషేకం



పెంచలకోన ఆలయం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీరసింహస్వామి ఆలయంలో 22వ తేదీన జ్యేష్ఠాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జ్యేష్ఠ మాసంలో జ్యేష్ఠా నక్షత్రం, పౌర్ణమి ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవాలయాల్లో హోమం, అభిషేకాలు నిర్వహించడం ఆచారమన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ, నరసింహ హోమం, 10 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో స్నపన పీఠంపై నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి 81 కలశాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

27న హజరత్ ఖాదర్‌షావలీ గంధోత్సవం



పట్టణంలోని హాజరత్ ఖాదర్‌షావలీ దర్గా

నాయుడుపేట టౌన్: ఈ నెల 27 తేదీన నాయుడుపేట పట్టణంలోని హజరత్ ఖాదర్‌షావలీ(చిన్న దర్గా) గంధోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. వారు గురువారం గంధోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు. దర్గాలో నిషాన్ జెండా వద్ద ఫాతేహాలు జరిపారు. 27 తేదీ నుంచి రెండు రోజులు గంధోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు చాన్‌బాష, శేఖర్, షేక్ రియాజ్, నీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, మురళీ, మస్తాన్, కువ్వాకుల శ్రీనివాసులు, పఠాన్ హర్షద్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం





దర్గాలోని సమాధుల వద్ద గంధం ఉంచుతున్న కమిటీ సభ్యులు, దర్గా వద్దకు గంధం తీసుకువస్తున్న రియాజ్ కుటుంబ సభ్యులతో మత పెద్దలు

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ హాషీం హుస్సేనీ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన గంధోత్సవం గురువారం వేకువజామున ముగిసింది. ఇక్కడ ప్రతి ఏటా క్రమం తప్పకుండా గంధోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. గంధోత్సవానికి చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించిన గంధోత్సవంలో భాగంగా ముందుగా పట్టణంలోని దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి వారి కుమారుడు రమీజ్ గంధాన్ని భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చారు. దర్గా వద్ద మత గురువులు మగ్దూమ్ అలీషా, చిష్టివుల్ ఖాదర్, ఖమర్ అలీషా చిష్టి, ఖాజాపీర్ దర్గా పీఠాధిపతి హుస్సేనీ సాహెబ్ చిష్టి, సయ్యద్‌ఖాదరీమదారి, దిల్‌దార్ అలీషా బాసిత్, ఖాదర్‌హుస్సేన్ ఖాదరి, గౌసే మస్తాన్‌ఖాదరి, కరిముల్లాచిష్టీ, అహ్మదుల్లాహుస్సేనీ, అన్సారీ ఖాదరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మగ్దూం, సందానీబాషా, గోల్డెన్ గౌస్, షబ్బీర్ అబ్దుల్లా, షాన్‌వాజ్ సమక్షంలో దర్గాలో గంధాన్ని లేపనం చేశారు. అనంతరం తమిళనాడుకు చెందిన ఫకీర్‌ల బృందాలు చేసిన జరబు విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు గంధం పంచిపెట్టారు.

వైభవంగా ద్రౌపదీదేవి ఊరేగింపు



ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయాన్నే స్వామి,అమ్మవార్ల విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం భాగవతారిణి రెడ్డెమ్మ అరణ్యపర్వం హరికథా గానం చేశారు. రాత్రి అర్జునుడి తీర్థయాత్ర వీధి నాటక ప్రదర్శన అలరించింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీస్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజారి రవి తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్జున తపస్మాన్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అర్జున తపస్సుమాను కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మెన్ మాధవరెడ్డి తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విశాఖ పట్టణానికి చెందిన పోతురాజు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వారు ఆలయ అధికారులను కలిసి విరాళం అందజేశారు. అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. ఏఈవో సతీష్‌మాలిక్, పీఆర్వో నాగభూషణంనాయక్ రవి తదితరులు పాల్గొన్నారు.